క్లుప్తంగా

సబ్ స్టేషన్లలో మౌలిక వసతులు కరువు

పాపన్నపేట(మెదక్): విద్యుత్ సబ్‌స్టేషన్లలో మౌలిక వసతులు లేక ఆపరేటర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మెదక్ జిల్లా సీఐటీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రబానప్ప వాపోయారు. శుక్రవారం ఆయన పాపన్నపేటలో మాట్లాడుతూ.. పాములు, విషపు పురుగుల బెడద, కనీస సౌకర్యాలు లేక ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఎర్తింగ్‌కు నీళ్లు పోద్దామంటే సబ్ స్టేషన్లలో నీరే లేదన్నారు. కంట్రోల్ రూములు లేక ఆరు బయటే నిద్రిస్తున్నామన్నారు. ఫర్నిచర్, వాటర్, గ్లౌసులు, రెయిన్ కోట్లు కూడా ఇవ్వలేదన్నారు. సబ్ స్టేషన్ల పరిధిలో 25 ఏళ్ల క్రింద వేసిన లైన్లే ఉన్నాయన్నారు. వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నామని, కనీస వసతులు కల్పించాలన్నారు.

బీఆర్‌ఎస్ ప్రచారం



నర్సాపూర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నర్సాపూర్: బీఆర్‌ఎస్ నాయకులు, కౌన్సిలర్లు తమ వార్డుల్లో మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటింటి ప్రచారంలో ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులే తమకు మెజార్టీ తెచ్చి పెడతాయని అన్నారు.

రాజ్యాంగం ఒక్కరి సొత్తుకాదు



మాట్లాడుతున్న సంజీవ

చిలప్‌చెడ్(నర్సాపూర్): రాజ్యాంగం ఒక్కరి సొత్తుకాదని, భారత పౌరులందరికీ భారత రాజ్యాంగంపై హక్కు ఉంటుందని జాతీయ మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సంజీవ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రం చిలప్‌చెడ్‌లో మాట్లాడుతూ.. దేశ ప్రధాని హోదా మోదీకి రాజ్యాంగం ద్వారా వచ్చిందన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు మండల అధ్యక్షుడు బేగరి బాలరాజు, జిల్లా ప్రచార కార్యదర్శి సత్యం, ఉపాధ్యక్షుడు సుభాష్, సత్యం, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కుప్పను ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

– చికిత్స పొందుతూ మృతి



సత్యనారాయణ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): వరిధాన్యం కుప్పను ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలై, చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన సుంచు సత్యనారాయణ (45) గురువారం రాత్రి తన పొలం వద్దకు వెళ్లి ఇంటికి వస్తున్న క్రమంలో దారి మధ్యలో వడ్ల కుప్పను ఢీకొని తీవ్రగాయాల పాలయ్యాడు. కాగా తన తండ్రి పొలం వద్దకు వెళ్లి రాకపోవడంతో వెతుకుంటూ వెళ్లగా తీవ్రగాయల పాలై వరికుప్పపై పడి ఉన్నాడు. వెంటనే చికిత్స నిమిత్తం తూప్రాన్ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు సత్యనారాయణ కుమారుడు సురేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

5 నుంచి విద్యార్థులకు కిక్‌బాక్సింగ్ శిక్షణ

గజ్వేల్‌రూరల్: కరాటే, కిక్ బాక్సింగ్ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా జిల్లా చీఫ్ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం ఆయన గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతూ జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా, జిల్లా కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ నుంచి నెల రోజులు పట్టణంలోని మహతి హైస్కూల్, ప్రజ్ఞాపూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో ఉచిత కరాటే, కిక్ బాక్సింగ్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ రోజు ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు శిక్షణ ఇస్తామన్నారు. 16 ఏళ్లలోపు బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 98664 02615 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నిరుపయోగంగా హాస్టల్ భవనం

- అవస్థలు పడుతున్న మోడల్‌స్కూల్ విద్యార్థినులు
- ప్రారంభించి ఏడాదైనా.. అందుబాటులోకి రాని వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



పెద్దశంకరంపేట మోడల్‌స్కూల్ హాస్టల్ భవనం

పెద్దశంకరంపేట(మెదక్): ఎన్నో ఏళ్లగా మోడల్‌స్కూల్ హాస్టల్ భవనం లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పెద్దశంకరంపేట మోడల్ స్కూల్ బాలికల హాస్టల్ పూర్తయి.. ఏడాదైనా ఇంకా వినియోగంలోకి రాలేదు. వచ్చే విద్యా సంవత్సరం నుంచైనా హాస్టల్‌ను విద్యార్థినులకు అందుబాటులోకి తీసుకొని వస్తే ఇబ్బందులు దూరమవుతాయి. మండలంలోని ఆయా గ్రామాల విద్యార్థులు నిత్యం ఇక్కడికి వచ్చి వెళ్లేందుకు అవస్థలు తప్పట్లేదు. మండల కేంద్రం పెద్దశంకరంపేటలో 2013లో మోడల్‌స్కూల్‌ను ప్రారంభించారు. అప్పట్లోనే బడికి సొంత భవనంతో పాటు బాలికల హాస్టల్‌కు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

161వ జాతీయ ప్రధాన రహదారి విస్తరణలో మోడల్‌స్కూల్ భవనం కొంత మేర తొలగించారు. స్కూల్ పక్కన ఏర్పాటు చేసిన వసతి గృహ నిర్మాణానికి నిధులు సరిపడా లేక ఎక్కడికక్కడే పనులు కొంతకాలంగా నిలిచిపోయాయి. ఏడాదిన్నర మీదట టీఎస్‌ఈడబ్ల్యూ ఐడీసీ ద్వారా రూ.1.30 కోట్లు మంజూరవడంతో నిర్మాణ పనులు చకచకా కొనసాగించారు. నిధుల మంజూరుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపడంతో విద్యార్థులకు ఇబ్బందులు దూరమయ్యాయి. గత ఏడాది క్రితం ఈ హాస్టల్‌ను జహీరాబాద్ ఎంపీ బి.బి.పాటిల్, అప్పటి నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



పెద్దశంకరంపేటలో హాస్టల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బీబీపాటిల్(ఫైల్)

ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు ఈ భవనాన్ని వినియోగంలోకి రాకపోవండంతో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన వసతి గృహం ప్రస్తుతం అలంకారప్రాయంగా మారింది. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టి, వసతిగృహాన్ని వినియోగంలోకి తేవాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

మొదట 40 మందికి అవకాశం

బాలికల హాస్టల్‌లో మొదట కింది అంతస్తు పూర్తి కాగా, 40 మంది విద్యార్థినులకు హాస్టల్ సదుపాయం లభించనుంది. 10 గదుల్లో, వంట గది, డైనింగ్‌హాల్‌తో పాటు సిబ్బందికి అవసరమైన గదులు నిర్మించారు. ఫర్నీచర్ కూడా అందుబాటులోకి రావాల్సి ఉంది. ఏఎన్‌ఎం, కాపలాదారు కేర్ టేకర్, వంట నిర్వాహకులు ఇలా మొత్తం ఏడు మంది సిబ్బందిని ఇందుకోసం నియమించనున్నారు. మోడల్ స్కూల్‌లో 500 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో 300లకు పైగా బాలికలున్నారు. హాస్టల్‌పై మరో అంతస్తు నిర్మిస్తే వంద మందికి వసతి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

> **చర్యలు తీసుకుంటాం**
>
> మోడల్‌స్కూల్ హాస్టల్ భవనం త్వరలో అందుబాటులోనికి వచ్చే అవకాశం ఉంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే వచ్చే విద్యా సంవత్సరం నాటికి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదించాం.
>
> – విఠల్‌నాయక్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్, పెద్దశంకరంపేట

నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం

బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్



రఘునందన్ రావుకు మద్దతుగా బీజేపీ నాయకుల ప్రచారం

నర్సాపూర్ రూరల్: నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రామచంద్రపూర్‌తో పాటు తదితర గ్రామాల్లో బీజేపీ నాయకులకు కలిసి మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీజేపీ పాలనలో దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. నరేంద్ర మోదీ భారత దేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా పెంచారన్నారు. రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు మోదీ అనేక పథకాలను ప్రవేశపెట్టి అభివృద్ధి చేస్తున్నారన్నారు. భారతదేశం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే మరోసారి బీజేపీని గెలిపించాలని కోరారు. ప్రచారంలో మాజీ ఎంపీపీ రమణారావు మండలాధ్యక్షుడు నీలి నగేష్, లక్ష్మణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న బీఆర్‌ఎస్ ప్రచారం



మనోహరాబాద్(తూప్రాన్): కూచారంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం, ముప్పిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కారు గుర్తుకు ఓటు వేసి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ర్యాకల శేఖర్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మహేశ్, నాయకులు పురం రవి, ఉదయ్‌రంజన్‌గౌడ్, వీరేష్ తదితరులున్నారు.

అనిల్‌కుమార్‌ను గెలిపించాలి

పెద్దశంకరంపేట(మెదక్): జహీరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఎంపీపీ జంగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గొట్టిముక్కుల గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలకు, ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకే ఓటేసి గెలిపించాలని ఎంపీపీ కోరారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ లక్ష్మీ రమేష్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దత్తు, రైతు బంధు మాజీ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ మానిక్‌రెడ్డి, నాయకులు రాజుగౌడ్, తుకారం, సురేష్ తదితరులు ఉన్నారు.

పల్లెల్లో హోం ఓటింగ్ పరిశీలన



మనోహరాబాద్(తూప్రాన్): కోనాయపల్లిలో వృద్ధురాలితో ఓటు వేయిస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం హోమ్ ఓటింగ్ నిర్వహించారు. ప్రత్యేకంగా నియమించిన ఎన్నికల సిబ్బంది 85 ఏళ్లు పై బడిన వృద్ధులతో పాటు ఫిజికల్ సమస్యలతో ఉన్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఓటింగ్ నిర్వహించారు. హోమ్ ఓటింగ్ సరళిని తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఆర్‌ఐ కిషన్ పరిశీలించారు. మండల వ్యాప్తంగా 63 హోమ్ ఓటింగ్ ఓటర్లు ఉన్నారని చెప్పారు. శనివారంతో హోమ్ ఓటింగ్ పూర్తి అవుతుందని చెప్పారు.

ఓటేసిన వృద్ధులు

మనోహరాబాద్(తూప్రాన్): మెదక్ పార్లమెంట్ పరిధిలోని గజ్వేల్ నియోజకవర్గం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని వృద్ధుల వద్దకు వెళ్లి ఓటు నమోదు చేయించారు. ఈ సందర్భంగా కోనాయపల్లి(పీటి) గ్రామంలో పోలింగ్ కేంద్రానికి చెందిన వృద్ధుల ఓటును పోలింగ్ అధికారి అమృత ఆధ్వర్యంలో ఇంటికి వెళ్లి ఓటు వేయించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పోలింగ్ అధికారి సురేందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఉప్పులింగాపూర్ హల్దీవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ నవత పేర్కొన్నారు. వేకువజామున 3 గంటల ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ అక్రమ ఇసుక రవాణా అడ్డుకొని మూడు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్ తరలించినట్లు తెలిపారు. ఘటనపై సంబంధిత వాహన యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్ట రిత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

215 మంది ఓటు వినియోగం

నర్సాపూర్: హోం ఓటింగ్‌లో వృద్ధులు, దివ్యాంగులు కలిపి 215 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 260 మంది ఓటర్లు తాము ఇంటి నుంచి ఓటు వేస్తామని హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేశారన్నారు. హోం ఓటింగ్ ద్వారా దరఖాస్తు చేసిన ఓటర్లు ఓటు వేసేందుకు ఏర్పాట్లు చేసి, నియోజకవర్గాన్ని 12 రూట్లుగా విభజించామన్నారు. హోం ఓటింగ్ తేదీని ముందుగా ప్రకటించిన మేరకు శుక్రవారం ఎన్నికల అధికారులు వారి ఇళ్లకు ఎన్నికల సామాగ్రితో వెళ్లారని తెలిపారు. కాగా 12 రూట్లలో ఉన్న 260 మంది ఓటర్లలో 215 మంది శుక్రవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. మరో 45 మంది ఓటు వేయాల్సి ఉందని వివరించారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని మెదక్ లోక్‌సభ ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ డీఐజీ రామేశ్వర్‌సింగ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతీ వాహనాన్ని నిశితంగా తనిఖీ చేయాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ చంద్రమోహన్, సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కాంగ్రెస్‌తోనే అభివృద్ధి**

టేక్మాల్(మెదక్): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి జరుగుతుందని, బీజేపీకి ఓటు వేస్తే కులమతాల చిచ్చు వస్తుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం టేక్మాల్‌లో ఆయన మాట్లాడుతూ... చేయిగుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. సురేష్ షెట్కార్ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు.

◆ **బీజేపీ గెలుపు ఖాయం**

పెద్దశంకరంపేట(మెదక్): జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీబీ.పాటిల్ గెలుపు ఖాయమని బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆరేపల్లి, గొట్టిముక్కుల, రాఘవానితండా, ఇసుకపాయతండా గ్రామాల్లో బీజేపీ అధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి గెలిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, శ్రీహరి, సంగమేశ్వర్ తదితరులున్నారు.

◆ **కొనసాగుతున్న బీజేపీ ప్రచారం**



మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్, మనోహరాబాద్, రామాయపల్లి తదితర గ్రామాల్లో బీజేపీ నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ కమలం గుర్తుకు ఓటు వేసి రఘునందన్‌రావును గెలిపించాలని ఓటర్లను కోరారు. నేడు మనోహరాబాద్ మండలంలో రఘునందర్‌రావు ప్రచారం నిర్వహించనున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు నరేందర్‌చారి, వేణుగోపాల్‌రెడ్డి, గోపాల్, చంద్రశేఖర్ , మల్లేశ్ తదితరులు ఉన్నారు.

◆ **మేకల దొంగలను పట్టుకోండి సారూ..**

నర్సాపూర్ రూరల్: మేకల దొంగలను పట్టుకొని తనకు న్యాయం చేయాలని రామచందర్ నాయక్ శుక్రవారం విలేకరులతో మొరపెట్టుకున్నాడు. మండలంలోని నారాయణపూర్ పంచాయతీ పరిధిలోని గంగారం తండాకు చెందిన రామచందర్ వారం రోజుల క్రితం ఇంటి ఎదుట ఉన్న పాక నుంచి దొంగలు నాలుగు మేకలు ఎత్తుకెళ్లారని చెప్పాడు. రెండు రోజుల క్రితం మా తండాకు చెందిన మరో వ్యక్తి రఘు నాయక్ చెందిన ఒక మేకను దొంగలు ఎత్తుకెళ్లారు. దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించిన వారు పారిపోయారని వాపోయాడు. పోలీసులు గ్రామాల్లో అప్పుడప్పుడు గస్తీ తిరిగితే దొంగల బెడద ఉండదని గంగారం తండావాసులు కోరుతున్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



నర్సాపూర్ రూరల్: సీతారాంపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైనందున ప్రజలు బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారని ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. శుక్రవారం ఆమె సమక్షంలో మండలంలోని గొల్లపల్లికి చెందిన పలువురు ఆయా పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోపి, శేఖర్, లక్ష్మీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డిని గెలిపించండి

నర్సాపూర్ రూరల్: కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని, వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండలంలోని సీతారాంపూర్‌లో మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలను దృష్టిలో పెట్టుకొని సాగునీరు, రైతు బీమా, రైతుబంధు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ , వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, గీతా, నేత కార్మికులకు పెన్షన్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. యథావిధిగా అన్ని పథకాలు, అభివృద్ధి జరగాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో సింగయ్యపల్లి గోపి, నయీమ్, సత్యం గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, జితేందర్ రెడ్డి, శివకుమార్, గోవా శేఖర్, సేనాధిపతి, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమని, కేంద్రంలో మోడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ విజయం సాధించనుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి అన్నారు. శుక్రవారం వెల్దుర్తి మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం వెల్దుర్తిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధికి అండగా నిలవాలన్నారు. పేదల సంక్షేమం ప్రధాని మోడీతో సాధ్యమని, మళ్లీ ప్రధానిగా గెలిపించాలని కోరారు. ప్రచారంలో మండల అధ్యక్షుడు నర్సింలు, మండల ఇన్‌చార్జి బుచ్చేష్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, శేఖర్‌గౌడ్, వెంకటేశం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు డ్రిప్ పైపులు దగ్ధం



మంటలు అంటుకున్న డ్రిప్‌పైపులు

నిజాంపేట(మెదక్): ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాట్ సర్క్యూట్ అవడంతో మంటలు చేలరేగి విలువైన డ్రిప్ పైపులు దగ్ధమైన సంఘటన మండలంలోని ఖాసీంపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఖాసీంపూర్ గ్రామానికి చెందిన రైతు జీడీ నారాగౌడ్ పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు ఒక్కసారిగా షాట్ సర్క్యూట్‌తో మంటలు చేలరేగాయి. దీంతో కొసిన మొక్కజొన్న పంటకు మంట అంటుకుంది. ఫలితంగా సూమారు 2 లక్షల విలువైన డ్రిప్ పైపులు ఖాళీ పోయాయి. స్థానికంగా ఉన్న రైతులు వెంటనే మంటలను ఆర్పారు. ప్రభుత్వం అతన్ని ఆదుకోవాలని వేడుకున్నాడు.

త్వరలో రుణమాఫీ



ప్యారారంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

రేగోడ్(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయనుందని పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్ తెలిపారు. మండలంలోని ప్యారారం గ్రామంలో శుక్రవారం జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ కుమార్ షెట్కార్‌ను గెలిపించాలని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ఐదు గ్యారంటీ పథకాలను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని చెప్పారు. మంత్రి దామోదర రాజనర్సింహ కృషితో అందోల్ నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పడుతోందని చెప్పారు. బీఆర్‌ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే అని తెలిపారు. సురేశ్ కుమార్ షెట్కార్‌కు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు ఎస్.దిగంబర్ రావు, మాజీ సర్పంచ్ మల్లయ్య, మాజీ ఉప సర్పంచ్ సంగారెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట ఉన్నత పాఠశాలకు చెందిన 2003 – 04 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం పోతిమిశెట్టిపల్లి గ్రామ శివారులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాల చదువులో గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.

ప్రజా సేవచేసే భాగ్యం కల్పించండి

మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి



మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి

కొల్చారం(నర్సాపూర్): ప్రజా సేవచేసే భాగ్యం కల్పించాలని మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలో కొల్చారంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా అంగడి బజార్లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. బస్టాండ్ నుంచి పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడారు. కేసీఆర్ నేతత్వంలోని ప్రభుత్వం పదేళ్ల పాటు రాష్ట్రాన్ని సంక్షేమ దిశగా నడిపించిందన్నారు. సమావేశంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగె రమేశ్ కుమార్, ఎంపీపీ, జెడ్పీటీసీ మంజుల, మేఘమాల, మండలాధ్యక్షుడు గౌరీ శంకర్‌గుప్తా, యువజన పార్టీ అధ్యక్షుడు సంతోష్ రావు, రవితేజ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, రంగంపేట గ్రామాధ్యక్షుడు దుర్గేష్, ఎంపీటీసీ మాధవి రాజాగౌడ్, నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, రవితేజ రెడ్డి, నాయకులు నరేందర్ రెడ్డి, ఆంజనేయులు, కాశీనాథ్, గోదావరి, మల్లేశం, వెంకటేశంగుప్తా, వెంకట్‌గౌడ్, రాజాగౌడ్ పాల్గొన్నారు.

ఎంపీగా అవకాశమివ్వండి

పాపన్నపేట(మెదక్): కలెక్టర్‌గా ఆదరించారు.. ఎంపీగా అవకాశమివ్వండంటూ వెంకట్రామిరెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రమైన పాపన్నపేటలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.